క్లుప్తంగా

జూలూరుపాడు తహసీల్దార్‌గా శారద



జూలూరుపాడు: జూలూరుపాడు తహసీల్దార్‌గా రాజబోయిన శారద బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శారద స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సత్వర సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్‌ను జూలూరుపాడు క్యాంపు కార్యాలయంలో తహసీల్దార్ ఆర్ శారద కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాములు నాయక్ తహసీల్దార్ శారదకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్ తినిపించారు. ఎంపీపీ లావుడ్యా సోనీ, సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్, వేల్పుల నరసింహారావు ఉన్నారు.

టేకులపల్లి తహసీల్దార్‌గా వీరభద్రం



టేకులపల్లి: టేకులపల్లి తహసీల్దార్ ఎల్.వీరభద్రం బుధవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన కె.వి.శ్రీనివాస్‌రావు కలెక్టరేట్‌కు బదిలీ కావడంతో ములకలపల్లిలో పనిచేస్తున్న వీరభద్రం టేకులపల్లికి బదిలీపై బాధ్యతలు చేపట్టారు.

బ్యాగులు, పలకల పంపిణీ

పాల్వంచ: పట్టణ పరిధిలోని బంగారుజాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నవభారత్ ఎంప్లాయిస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం స్కూల్ బ్యాగులు, పలకలు అందించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యులు ఏజీఎం సత్యనారాయణ మాట్లాడుతూ... సొసైటీ ద్వారా సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సొసైటీ ప్రెసిడెంట్ ఏజీ.శంకర్, మోహన్‌రావు, రవీంద్రరెడ్డి, కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వితరణ

పాల్వంచ: అశ్వాపురంలోని వృద్ధాశ్రమానికి కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారానికి చెందిన సహాయక ఇంజనీర్లు బుధవారం నగదు వితరణ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ గోల్డ్ ఆధ్వర్యంలో ఇంజనీర్లు మానస, సాహితీలు రూ.5వేల నగదు అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు చాట్ల శ్రీనివాసరావు, ఆరుద్ర సత్యనారాయణ, పోట్రు సతీష్, రోశయ్య చౌదరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి పరామర్శ

జూలూరుపాడు: మండలంలోని గుండెపుడికి చెందిన ఓ చానల్ రిపోర్టర్ కాళ్లూరు యతిరాజ్ కుమార్ ఇటీవల మృతి చెందగా, బుధవారం పలువురు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ మంత్రి జలగం ప్రసాదరావు, సీపీఐ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, ఎస్‌కే.సాబీర్‌పాషా తదితరులు యతిరాజ్‌కుమార్ కుటుంబీకులను పరామర్శించి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఇంకా వివిధ పార్టీల నాయకులు చంద్ర నరేంద్రకుమార్, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, రంగారావు, కొమ్మినేని పాండురంగారావు, పగడాల అఖిల్, ఎస్.కే.చాంద్‌పాషా, తూము కోటయ్య, చింతా స్వరాజ్‌రావు, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, యల్లంకి మధు పాల్గొన్నారు.

యాకూబ్ అలీ మృతికి సంతాపం

జూలూరుపాడు: మండలంలోని పుట్టకోటకు చెందిన బీఆర్ఎస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు సుభానీ తండ్రి యాకూబ్ అలీ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు ఆయన మృతదేహం వద్ద ఎమ్మెల్యే రాములునాయక్ నివాళులర్పించి కుటుంబీకులను సనామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్యా సోనీతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, పొన్నెకంటి సతీష్ కుమార్, నున్నా రంగారావు, దుద్దుకూరి మధుసూధన్‌రావు, లావుడ్యా కిషన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై ఫిర్యాదు

పాల్వంచరూరల్: గతేడాది జరిగిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనుల్లో నిబంధనలకు విరుద్ధంగా పనులకు రాని కూలీలకు మస్టర్లు వేసి నిధులు స్వాహా చేశారని మండల పరిధి యానంబైల్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఫిర్యాదు చేశారు. సర్పంచ్ పదవిలో ఉంటూ వందరోజుల పనులు చేస్తున్నాడని ఫిర్యాదు చేశారు. పనులకు రాకున్న వచ్చినట్లుగా మస్టర్లు వేసి రూ.76వేల వేతనాలు డ్రా చేసుకుని అవినీతికి పాల్పడ్డారని చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుచేశారు. ఏఓ శంకర్, ఏపీఓ రంగా, సోషల్ ఆడిట్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి తొలగింపు

పాల్వంచ: పాల్వంచకు చెందిన బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి చీకటి కార్తీక్‌ను రాష్ట్ర కమిటీ నుండి తొలగిస్తున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి చీకటి కార్తీక్ రాజీనామా చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి అనుచరుడిగా కొనసాగుతానని పేర్కొన్నారు.

న్యూ గొల్లగూడెంలో.. అన్నీ పాత సమస్యలే..!

- సరైన రోడ్లు కూడా లేక స్థానికుల అవస్థ
- డ్రెయినేజీల్లో మురుగుతో దుర్గంధం
- సదుపాయాలపై అధికారులు దృష్టి సారించాలని వినతి



డ్రెయినేజీలో పేరుకుపోయిన మురుగు



సీసీకి నోచుకోని కాలనీలోని అంతర్గత రహదారి

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం మున్సిపల్ పరిధి 16వ వార్డులోని న్యూగొల్లగూడెం వాసులు సమస్యలతో అల్లాడిపోతున్నారు. ఎన్నిమార్లు చెప్పినా అధికారులు దృష్టి సారించకపోవడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. కనీస సౌకర్యాలైన రోడ్లు, డ్రెయినేజీలు కూడా లేకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. వార్డులోని పలు ప్రాంతాల్లో నాణ్యమైన రోడ్లు కూడా లేకపోవడంతో ప్రజలకు ఇబ్బంది పెడుతోంది. ఇక డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా మారి మురుగునీరు ముందుకు పారక దుర్గంధం వెదజల్లుతోంది. ఈ కారణంగా దోమలు విజృంభించి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఎక్కడో ఓ చోట తప్ప వీధిలైట్లు లేకపోవడంతో స్థానికులు రాత్రి వేళ బయటకు రావాలంటే జంకుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించడమే కాక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలపై దృష్టి సారిస్తాం



కొత్తగూడెం మున్సిపాలిటీ 16వ వార్డులో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణంతో పాటు అవసరమైన చోట వీధిలైట్లు బిగిస్తాం. అలాగే, దోమల నివారణకు ఫాగింగ్, నిరంతరం పారిశుద్ధ్య పనులు చేపట్టేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం.

– రవి, మున్సిపల్ కమిషనర్

ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలి



రాజీవ్ గృహకల్ప కాలనీలో డ్రెయినేజీలు నిర్మించాలి. లేకపోతే మురుగునీరు ఇళ్ల మధ్యలో చేరి దోమలు విజృంభిస్తున్నాం. అటు డ్రెయినేజీలు నిర్మించక, ఇటు దోమల నివారణకు ఫాగింగ్ చేయక వ్యాధుల బారిన పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు డ్రెయినేజీల నిర్మాణంపై స్పందించాలి.

– వాసవి, న్యూగొల్లగూడెం

డ్రెయినేజీలు శుభ్రం చేయాలి



మా వీధుల్లో డ్రెయినేజీలు సరిగ్గా లేక ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. దీంతో దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇకనైనా సరైన పద్ధతిలో డ్రెయినేజీలు నిర్మించి మా ఇబ్బందులు తొలగించాలి.

– కళావతి, రాజీవ్ గృహకల్ప కాలనీ

అధికారులు చొరవ చూపాలి



కొత్తగూడెం 16 వార్డు పరిధిలోని సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి. డ్రెయినేజీల నిర్మాణానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. నిధులు కేటాయించగానే పనులు చేయిస్తాం. అప్పటి వరకు తాత్కాలిక చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు కోరాను.

– మాచర్ల రాజకుమారి, కౌన్సిలర్

‘రెబల్ ఆఫ్ తుపాకులగూడెం’ను ఆదరించండి



సినిమా యూనిట్ సభ్యులు

కొత్తగూడెంటౌన్/పాల్వంచ: జిల్లా నటులతో నిర్మించిన ‘రెబల్ ఆఫ్ తుపాకులగూడెం’సినిమా శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా ప్రేక్షకులు ఆదరించాలని యూనిట్ సభ్యులు కోరారు. ఈమేరకు కొత్తగూడెంలోని ప్రియదర్శిని డిగ్రీ, పీజీ కాలేజీలో బుధవారం సినిమా పోస్టర్లను ఆవిష్కరించగా నటులు ఊటుకూరు వంశీ, బరిగెల శరత్, వినీత్‌కుమార్, కె.విజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రవీణ్, శ్రీకాంత్ హీరోలుగా, హాజయత్రి మకాన్ హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాకు జైదీప్ విష్ణు దర్శకత్వం, మణిశర్మ సంగీతం వహించారన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువకులు ఉద్యోగాల కోసం ప్రయత్నించే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటారనే యథార్థ గాధ ఆధారంగా నిర్మించిన ఈ సినిమాను అన్నివర్గాల ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రియదర్శిని కాలేజీ ప్రిన్సిపాల్ నయీం తదితరులు పాల్గొన్నారు. అనంతరం యూనిట్ సభ్యులు పాల్వంచలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ తమ సినిమాను ఆదరించాలని కోరారు.

ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

పాల్వంచ: అచ్చం పేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కామేష్ మాట్లాడారు. ప్రవీణ్‌కుమార్‌ను విమర్శించడం హేయమైన చర్య అన్నారు. బీఎస్పీ ఎదుగుదలను ఓర్వలేక చేస్తున్న విమర్శలను తిప్పికొడతామని హెచ్చరించారు. పట్టణ అధ్యక్షుడు కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, కేతిని కుమారి, లలిత, సరోజ, అనిల్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిల్ పంపిణీ స్కీం అమలుచేయాలి

పాల్వంచరూరల్: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించిన విధంగా మోటారు సైకిల్ పంపిణీ స్కీంను అమలుచేయాలని డిమాండ్‌చేస్తూ బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ మేరకు తహసీల్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి పద్మ మాట్లాడుతూ.. కార్మికులకు మోటారు సైకిళ్ల పంపిణీ చేస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్ నేటికి ఆచరణలో అమలు చేయలేదన్నారు. పట్టణ కన్వీనర్ కె.సత్య, సభ్యులు రాములు, ఎస్‌కె.రహీం, నాగరాజు, బి.నగేష్, నర్సింహారావు, శాకిర్, కుర్మయ్య, రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాజీకి సన్మానం

చుంచుపల్లి: ముస్లిం సమాజ పెళ్లిళ్ల, విడాకులు, ఇతరత్రా సేవలను వక్ఫ్ బోర్డు ఆధీనంలో చట్టబద్ధత కల్పించేందుకు రాష్ట్ర మైనారిటీ వెల్ఫేర్ శాఖ ఖాజీ యాక్ట్ 1880 ప్రకారం ప్రభుత్వ ఖాజీగా మొహమ్మద్ అబ్దుల్ రషీద్ ఖాన్ నియమిస్తూ సర్కారు ఉత్తర్వులు జారీచేసింది. నూతనంగా నియమితులైన ఖాజీ అబ్దుల్ రషీద్ బుధవారం చుంచుపల్లి మండలంలోని మదినా మస్జిద్‌లో కొత్తగూడెంలోని జమాత్‌లు, ప్రముఖులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం హక్కుల పోరాట సమితి సభ్యులు అబ్దుల్ జలీల్, ఖలీల్, కరీం మౌలానా, గౌసుద్దీన్, ఇస్మాయిల్, షేక్ బాసిత్, ఇమ్రాన్, మసూద్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి

పాల్వంచ: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని కేటీపీఎస్ ఎస్ఈ ఎం.శ్రీనివాసరావు అన్నారు. కేటీపీఎస్ 7వ దశ సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని అభ్యుదయ ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినులకు స్నాక్స్ అందించే కార్యాక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. డీఈలు జె.శ్రీనివాస్, జేవీకే.ప్రసాద్, ఎన్.శ్రీనివాస్, కేవీ.రమణ, వి.చంద్రమౌళి, సీనియర్ కెమిస్ట్ సీహెచ్.గిరిధర్, ఏడీఈ ఎస్‌కె.యాస్మీన్ తదితరులు పాల్గొన్నారు.

వనదేవతలకు భక్తిశ్రద్ధలతో పూజలు

ఇల్లెందురూరల్: వనదేవతలైన సమ్మక్క, సారలమ్మలకు బుధవారం భక్తులు విశేషంగా పూజలు చేశారు. మినీ మేడారంగా వర్ధిల్లుతున్న బొజ్జాయిగూడెం సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్దకు భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలో గద్దెల వద్ద భక్తులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వేములవాడ గ్రామంలో సర్పంచ్ తాటి చుక్కమ్మ, ఉపసర్పంచ్ కుర్ర అరుణ, గ్రామస్తులు భారీగా తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది.

టేకులపల్లి: మండలంలోని జండాలతండాలో సమ్మక్క సారక్క జాతర వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఆనవాయితీ ప్రకారం వన దేవతను ఊరేగింపుగా గద్దెల వద్దకు తీసుకురావడంతో జాతర ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమంలో పూజారులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఇల్లెందురూరల్: నైవేద్యం తీసుకెళ్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య



టేకులపల్లి: మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

కలెక్టర్ దృష్టికి సంతకాల వివాదం



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ, ఉపసర్పంచ్ యాకూబీ

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్, ఉపసర్పంచ్ సంతకాల వివాదాన్ని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ, ఎంపీటీసీ దాస్యం ప్రమోద్‌కుమార్, ఉపసర్పంచ్ యాకూబీ బుధవారం కలెక్టర్ అనుదీప్ దృష్టికి తీసుకెళ్లారు. చెక్కులపై సంతకాలు పెడుతామని చెప్పినప్పటికీ ఆ అవకాశం ఇవ్వకుండా సర్పంచ్ పాయం స్వాతి తనను ఇబ్బంది పెడుతోందని ఉపసర్పంచ్ యాకూబీ కలెక్టర్‌కు వివరించారు. దీనికి స్పందించిన కలెక్టర్ ప్రజాప్రతినిధులు వివాదాలు సృష్టించుకొని తమ వద్దకు వస్తే ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే హరిప్రియ కలుగచేసుకొని గ్రామపంచాయతీకి సంబంధించిన చెక్కులపై సంతకాలు పెట్టేందుకు ఉపసర్పంచ్ సిద్ధంగా ఉందని, సర్పంచ్ ఆమెకు సహకరించడం లేదని ఫిర్యాదు చేశారు. సమగ్రంగా విచారణ నిర్వహించి తనకు నివేదిక ఇవ్వాలని ఎంపీడీఓ అప్పారావును కలెక్టర్ ఆదేశించారు.

కార్మికులకు ప్లేడేలు ఇవ్వాలి

సింగరేణి(కొత్తగూడెం): ఉత్పత్తి అనుసంధానంగా ఉన్న వర్క్‌షాపుల్లో పనిచేసే కార్మికులు పిట్టర్స్, ఎలక్ట్రీషన్స్, టెక్నీషియన్లు, హెల్పర్లకు, పంప్ సెక్షన్ వారికి ప్లేడేలు ఇవ్వాలని, కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ.రజాక్ వర్క్‌షాపు ఎస్ఈ శ్రీకాంత్‌ను కోరారు. బుధవారం ఆయన వర్క్‌షాపుల కార్మికులతో చర్చించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీఎంతో చర్చించి ప్లేడేలు ఏర్పాటు చేస్తామని ఎస్ఈ హామీ ఇచ్చారు. పిట్ కార్యదర్శి ఎండి.సత్తార్‌పాషా, కేవీ.రెడ్డి, జయరాజ్, వీఆర్సీ రెడ్డి, శ్రీమన్నారాయణ, కుమార్, మోహన్, సమ్మయ్య, గోపాల్, కోటేశ్వరరావు, సత్యనారాయణ, కనకయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

జలవికాస్ పథకంతో నీరందించాలి

టేకులపల్లి: బర్లగూడెం, లక్ష్మీపురం, కొప్పురాయి తదితర గ్రామాల్లో సాగునీటి సదుపాయం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి జల వికాస్ పథకం ద్వారా నీరందించాలని డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ జిల్లా నేత లక్కినేని సురేందర్‌రావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయా గ్రామాలకు చెందిన బాధిత రైతులు లక్కినేనిని కలిసి వారి గోడు చెప్పుకోవడంతో ఉపాధి హామీ పథకం ఈసీ తిరుపతిని పిలిపించి రైతులతో దరఖాస్తు ఇప్పించారు. ఆరు నెలల క్రితమే దరఖాస్తు చేసినా అధికారులు ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఊకె రామకృష్ణ, దనసరి వెంకటేశ్వర్లు, చంటి రైతులు పాల్గొన్నారు.

ఇల్లెందు ఏరియాలో 176 శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న జీఎం షాలేము రాజు

ఇల్లెందు: సింగరేణి పరిధిలోని ఇల్లెందు ఏరియాలో గడిచిన జనవరిలో 176 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించామని ఏరియా జీఎం షాలేమురాజు తెలిపారు. ఇల్లెందులోని జీఎం కార్యాలయంలో బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. జనవరి నెలలో 2.77లక్షల టన్నుల లక్ష్యానికి గాను 4.88 లక్షల టన్నులు బొగ్గు ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటివరకు 39.27 లక్షల టన్నుల లక్ష్యంలో 40.82 లక్షల టన్నులు(104శాతం) బొగ్గు ఉత్పత్తి చేశామని వెల్లడించారు. ఇక రైలు మార్గం ద్వారా 3.48లక్షల టన్నులు, రోడ్డు మార్గంలో 0.88 లక్షల టన్నులు, ఆర్‌సీహెచ్‌పీ ద్వారా 1.29 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు తెలిపారు. కాగా, జేకే ఓసీ ప్రాజెక్టు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయని జీఎం వివరించారు. మార్చిలో ప్రజాభిసేకరణ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు మల్లారపు మల్లయ్య, ఎం.గిరిధర్ రావు, సాయిస్వరూప్, జీ.వీ.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

చుంచుపల్లి: మండల పరిధిలో సర్వే నంబర్ 137/1 ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకున్న పేదలందరికీ ఇళ్ల పట్టాలు, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఇంటి స్థలాల పోరాట కమిటీ నాయకులు పోతినేని సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రేపాకుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పే అభివృద్ధి కేవలం కాగితాల్లో ఉందని విమర్శించారు. ప్రజలకు ఇండ్లు, విద్య, భూమి, వైద్యం అందినప్పుడే నిజమైన అభివృద్ధి అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రా ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లిక్కి బాలరాజు, భూక్యా రమేష్, వీరన్న, ఎస్.లక్ష్మి, ఈసం రాంబాబు, బాలకృష్ణ, ప్రేమ్ కుమార్, జబ్బ సంధ్యారాణి, రాము, సిద్దెల రాములు, పూజారి నాగమణి, వీరమ్మ, రామకోటమ్మ, శివ, రాజు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

ఇల్లెందురూరల్: కొమరారం కేంద్రంగా నూతన మండలం, ఇల్లెందు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో కొమరారం గ్రామంలో ప్రజాపంథా ఆధ్వర్యంలో మూడు రోజుల రిలే నిరాహార దీక్షను బుధవారం మాజీ ఎమ్మెల్యే, ఇల్లెందు రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ కన్వీనర్ గుమ్మడి నర్సయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొమరారం కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలనే డిమాండ్ న్యాయసమ్మతమే అయినా ఎన్నో పర్యాయాలు మంత్రులకు, ఎమ్మెల్యేలకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అబ్దుల్ నబి, మాజీ జెడ్పీటీసీ చంద్ర అరుణ, ప్రజాపంథా మండల కార్యదర్శి నాయిని రాజు, కొమరారం సర్పంచ్ నాళి కృష్ణవేణి, ఎంపీటీసీ ఆజ్మీర బిచ్చా, పూనెం కుమార్, వాంకుడోత్ శంకర్, ఎలుగు శాంతారావు, భూక్య పాష, ఇస్లావత్ కోటేష్, పొద్దుటూరి రాజేశ్వరరావు, అనుగోజు పెద్దచారి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి వెలుగు



కొత్తగూడెం అర్బన్ 24 వార్డులో కంటి పరీక్షలు..

కొత్తగూడెంఅర్బన్: పట్టణ పరిధిలోని 24వ వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని తహసీల్దారు రామకృష్ణ సందర్శించారు. కౌన్సిలర్ బాలిశెట్టి సత్యభామ, నాయకులు సుందర్‌రావు, మెప్మా సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: మండలంలోని మారుమూల గిరిజన అటవీ ప్రాంతమైన మల్లారం గ్రామంలో బుధవారం కంటిపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ప్రతాప్, వైద్య సిబ్బంది వందమంది గిరిజనులకు కంటి పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ ఈసం శ్రీనివాస్, ఉపసర్పంచ్ కొండల్‌రావు, కార్యదర్శి నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ఆదరించాలి

టేకులపల్లి: ఆర్టీసీని అందరూ ఆదరించాలని కొత్తగూడెం డిపో ఎస్టీఐ బి.సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు బుధవారం టీఎస్ఆర్టీసీకి సంబంధించిన ప్రజా రవాణా చైతన్య రథం టేకులపల్లి చేరుకుంది. స్థానిక సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైతన్య కళా బృందం కళాకారులు ఆట పాటలతో సందేశాత్మక గీతాలు ఆలపించారు. ఆర్టీసీ సిబ్బంది ఇస్నపల్లి శ్యామ్యూల్, ప్రభాకర్,కళాకారులు సాంబయ్య, శంకర్, వెంకటస్వామి, శ్రీనివాస్, స్వామి, రమేష్, కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చుంచుపల్లి: కొత్తగూడెం బస్టాండ్‌లో ఆర్టీసీ ప్రజా రవాణా చైతన్య యాత్రలో భాగంగా హైదరాబాద్ కళాజాత సాంబయ్య కళా బృందం కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. ఆర్టీసీని ప్రగతిబాటలో నడిపించటంలో భాగంగా ప్రయాణికులకు ఆట, పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎం వెంకటేశ్వరావు, సిబ్బంది రాణి, ఇసనపల్లి శామ్యూల్, ప్రభాకర్ పాల్గొన్నారు.

విమర్శలు చేస్తే సహించం

జూలూరుపాడు: సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లపై విమర్శలు చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం జూలూరుపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల నిర్వహించిన ఆత్మీయసమ్మేళనాల్లో విమర్శలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నున్నా రంగారావు, ఎస్కే మైబూ, భోజ్యాతండా సర్పంచ్ లావుడ్యా సోనీ, దుద్దుకూరి కృష్ణప్రసాద్, యల్లంకి పుల్లయ్య, మాచినేని సత్యనారాయణ, మోదుగు రామకృష్ణ, పణితి వెంకటేశ్వర్లు, దేవరకొండ కిరణ్, ఇల్లంగి తిరుపతి, బుడిపూడి ప్రభాకర్, బోడా కృష్ణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా టెన్నిస్ టోర్నమెంట్‌లో ప్రతిభ



వెంకటేశ్వర్లు అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పాల్వంచ: ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల శ్రీకాళహస్తిలో జరిగిన టెన్నిస్ పోటీల్లో పాల్వంచకు చెందిన అన్నం వెంకటేశ్వర్లు పాల్గొని ప్రతిభ చాటారు. సింగిల్స్ విభాగంలో పాల్గొని రన్నర్‌గా రెండో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం అన్నం వెంకటేశ్వర్లును జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి.యుగంధర్ రెడ్డి, సెక్రటరీ జకిరియా, టీఆర్‌సీ అధ్యక్షులు వై.వెంకటేశ్వర్లు, కొత్తగూడెం టెన్నిస్ అధ్యక్షులు సుందర్ రాజు, భద్రాచలం అధ్యక్షులు రాజు, సోందు, శ్రీనివాస్, లక్ష్మణ్, దిలీప్‌లు అభినందించారు.



అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా బీటీ రోడ్డు



మండలంలోని కాకర్ల-దుబ్బతండా గ్రామాల మధ్య గల బీటీ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. కాకర్ల గ్రామ సమీపంలో గల శ్రీ పెద్దమ్మతల్లి ఆలయం వద్ద బీటీ రోడ్‌ను ధ్వంసం చేయడంతో రాకపోకలు సాగించే ప్రజలకు ఇబ్బందికరంగా ఉంది. రాత్రి సమయాల్లో అయితే ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– జూలూరుపాడు

ప్రశ్నించాల్సిన అధికారి : లఖన్ నాయక్, ఆర్‌అండ్‌బీ ఏఈ, జూలూరుపాడు
సెల్ నంబర్ : 9866309579